# 8
# చెడుగులు

"బాగా ఆలోచించు" విజయ్ ఇంకోసారి అన్నడు.

సత్యం మనుసు మారలేదు. అదేమాట మల్లా చెప్పిండు. ఈసారి కొద్దిగ కోపంగా చెప్పిండు.

విజయ్ పట్టు ఇడువలేదు. ఎట్లన్నా సత్యంను ఒప్పించాలనుకున్నడు. వచ్చి పక్కనే కూసుంటూ "కాదు సత్తన్నా... నీకు నష్టమేముంది చెప్పు. ఏ కంపని మెడిసిన్ అమ్మినా... నీకు పది ఇరువై పర్సెంట్ కంటే ఎక్కువ కమీషన్ ఇయ్యరు. నేను ఫిఫ్టీపర్సంట్ ఇత్తనంటున్న. కుదురదంటే పర్సెంట్ ఎక్కువ అడుగు. అంతేగని అమ్మనే అమ్మనని చెప్పుడెందుకు?" అన్నడు విజయ్.

"నేను అమ్మనంటే అమ్మనే అమ్మ..." కచ్చితంగా అన్నడు సత్యం. అంటూ లేచి సెల్ఫ్‌లో మందుల డబ్బాలను సదురుతున్నడు.

విజయ్ మనసు నొచ్చుకున్నడు. అప్పటికప్పుడే వెళ్లిపోవాలనుకున్నడు. కానీ రోజూ వెయ్యి రూపాయల దాకా అమ్మకం ఉన్న షాపును ఇడువబుద్ధి కాలేదు. అదేగాక సత్యం నీతి మనిషి. బిల్లు వెంట వెంటనే ఇస్తడు. ఉద్దెర పెట్టడు.

ఆఖరిసారిగా బెదిరిత్తున్నట్టు "నువ్వు కాదంటే ఇంకో షాపుల ఇస్తా... నా సేల్స్‌కేమీ దోకలేదు. నువ్వు పాత కస్టమర్‌వు. నీ మంచికోసమే చెబుతున్న. లచ్చిమి రాంగ తడుక అడ్డం పెట్టుకోకు" అన్నడు విజయ్

ఆ బెదిరింపును లెక్క చెయ్యలేదు సత్యం. కోపంగనే " ఇచ్చుకో... నీ ఇష్టమున్న షాపుల అమ్ముకో... నా దగ్గరికి మాత్రం రాకు... మనం అన్నం తింటున్నం గడ్డికాదు. ఎంత వ్యాపారమైనా ఉప్పుకు ఉప్పు అద్దుక తిన్నట్టుండాలె. ఇది పల్లెటూరు. తెలువని జనమే ఎక్కువ. ఇక్కడ కిరాణ దుకాణం ఒక్కటి ఉంటే మందుల దుకాణాలు రెండున్నయి. ప్రైవేట్ టీచర్లు ఇద్దరుంటే ఆరెంపీ డాక్టర్లు నలుగురున్నరు. దీనిని బట్టే చెప్పచ్చు... జనాల కష్టమంతా ఎటుపోతుందో... ఇంకా నువ్విచ్చిన జెనరిక్ మందులు అమ్మిననుకో.. పచ్చిరక్తం తాగినట్టయితది" అన్నడు.

ఇద్దరూ మెడికల్ షాపుల ఉన్నరు. షాపు అప్పుడే తెరువడంతో గిరాకి ఎక్కువలేదు. సత్యం డబ్బాలను సదురుతనే ఉన్నడు. ఏభావములేకుండా కొంతసేపు సత్యంనే చూస్తూ కూసున్నడు విజయ్. సత్యం ఏదో గులుక్కుంటున్నడు. విజయ్‌కు అక్కడ నిలవడబుద్ధి కాలేదు.

లేచి నిలబడి టై సర్దుకొన్నడు. బ్యాగ్ అందుకుని ముందుకు నడుస్తూ "నీతోని నా మందులు ఎట్ల అమ్మియ్యాలెనో నాకు బాగా తెలుసు.రెండు వారాలు ఆగు సాలు." అంటూ వెళ్ళిపోయిండు.

"షాపును మూతయినా పెట్టుకుంట. నీ మందులు మాత్రం అమ్మ" కచ్చితంగా అన్నడు సత్యం. ఆ మాటలు విజయ్‌కు వినిపించలేదు. అతడు వెళ్లిపోయినా అతని మీదకోపం మాత్రం పోలేదు సత్యంకు.

" పచ్చిరక్తం తాగుతుండ్రు... వీళ్లకు సావు గూడా సక్కగ రాదు. ఎవడు ఎటువంటోడో తెలుస్తలేదు. మొన్నటిదాక వీడే జెనరిక్ అమ్మద్దు. కంపని మందులే అమ్మాలని నీతులు చెప్పుతుండె" అనుకున్నడు.

ఎండ కొద్దిగ పైకెక్కింది. ఎండాకాలం కావడంతో సుర్రుమంటుంది. షట్టర్‌ను కొద్దిగా కిందికి దించిండు సత్యం. అప్పుడే మందుల చిట్టి పట్టుకుని ఒక పేషెంట్ వచ్చిండు. చిట్టీ తీసుకుని చూసిండు. తిరుపతి డాక్టర్ రాసిన చిట్టి అది. తిరుపతి ఇంటర్ ఫేల్. రెండు మూడేండ్లు చిల్లర చిల్లర తిరిగిండు. తండ్రి బలవంతం మీద ఒక నర్సింగ్‌హోంలో ఉన్నడు.

సరిగ్గా యాడాదైనా నిండకముందే ఊర్లె క్లీనిక్ తెరిచిండు తిరుపతి. మనిషి మాటకారి సైకిల్‌మీదనే ఇల్లిల్లూ తిరుగుతడు. తను ఊరికి సేవచేస్తున్నట్లు అందరినీ నమ్మిస్తడు.

చిట్టిమీద సెల్ఫ్ అని రాసి ఉంది. మందులన్నీ కవరులో పెట్టిండు. పద్దులను ఒకటికి రెండుసార్లు రాసి జమచేసి చూసుకుని తిరుపతి ఖాతాలో రాసుకున్నడు సత్యం.

"పైసలు ఎంతయినయి" మందుల కవరును తీసుకుంటూ అడిగిండు పేషెంటు.

'ఎంతైతే నీకేందిపో... తిరుపతే ఇత్తడు గదా..." సత్యం అన్నడు.

"ఆ.. ఇత్తడు ఇత్తడు. ఈతాకు ఇత్తడు తాటాకు తీత్తడు. ఎవలేం పున్యానికియ్యరు. మాకు గతిలేక ఎవలను ఎందుకనుడు గనీ... ఎంతయినయో చెప్పు. వాడు ఈనాడు ఇంత అనాడు అంత అని లెక్కగట్టి పంటల మీద దొబ్బిపోతడు..." అన్నడు పేషెంటు. అతడి మాటల్లో అసహనం

ఉంది.

సత్యం ఆలోచనలో పడ్డడు. తిరుపతి గురించి తెలుసు. ఇటువంటి పర్సనల్ కేసులు పది పన్నెండు దాక ఉన్నయి. యాళ్లకు పైసలుండయి గదా! పైసలు లేవని రోగం రాక ఉండది గదా! అన్నీ తన ఖాతాలనే రాసుకుని ఒక్కసారి వసూలు చేసుకుంటడు. సత్యంకు మాత్రం నెల నెలా లెక్క గట్టి ఇస్తడు.

ముందుగా ఈ పర్సనల్ ఖాతాలను ఒప్పుకోలేదు సత్యం. తండ్రి బలవంతం మీద నాలుగు తిట్టి ఒప్పించిండు.

పేషెంటు వెళ్ళిపోతడేమోనని చూసిండు సత్యం. పోలేదు పైసలు ఎన్నని ఇంకోసారి అడిగిండు. మందుల లెక్క చూసిండు సత్యం. ముప్పయిమూడు రుపాయలైనయి. తను గూడా ఖాతాలో అంతే రాసుకున్నడు. పైకి మాత్రం యాభై అయిదురూపాయలని చెప్పిండు.

పేషెంటుమెుఖం రంగుమారింది. కోపంగా" సత్తిగా... ఇంత పాపముంటాదిరా... ఇట్లఎంతమంది కొంపలు ముంచుతవురా...? తిరుపతి యాభైరూపాయలే అయితయన్నడు. నువ్వు ఐదు ఎక్కువంటివి... నీకు యాభైకంటే ఒక్కపైస ఎక్కువ ఇయ్యకుమంట... రక్తం తాగవడ్తిరి గదరా.." అని తిట్టుకుంట పోయిండు.

సత్యం గుండె కలుక్కుమంది. అప్పటికప్పుడు ఆ పేషెంటును పిలిచి అసలు విషయం చెప్పాలనుకున్నడు. ఎవలు రక్తం తాగుతున్నరో తేల్చాలనుకున్నడు. కానీ ధైర్యం చేయలేకపోయిండు.

ఇంతకుముందు ఒకసారి ఇట్లనే జరిగింది. పర్సనల్ కేసంటూ మందులకు వచ్చిండు పేషంట్ ఒకలు. ఇరువైమూడు రూపాయల బిల్లు అయింది. ఖాతాలో పద్దును రాసుకుంటూ బిల్లును ఉన్నదున్నట్టు చెప్పిండు.

ఆ పేషెంటు అగ్గిమీద గుగ్గిలమయిండు. తిరుపతి దగ్గరికిపోయి 'అరేయ్ తిరుపతిగా ఇంత మోసమారా... యాభై రుపాయలు అయితవంటివి. సగానికి సగం తింటావురా.. చేతుల పైసలు లెవ్వని నమ్మితే ఇంత పాపమారా" అని కొట్టవోయిండు.

తిరుపతి తెలివిగా అవన్నీ నకిలీమందులని, తను రాసిన కంపిని మందులు కావని తప్పును సత్యం మీదికి తోసిండు. అంతేగాక తెల్లారినుంచి సత్యం దుకాణంల మందులు కొనవద్దని పేషెంట్లదరికీ చెప్పిండు. సత్యం నకిలీమందులు అమ్ముతడని ఊరంతా తెలిసిపోయింది. గిరాకి సగానికి సగం తగ్గింది.

అప్పుడు షాపును మూసేద్దామనుకున్నడు సత్యం. వాళ్ల తండ్రే మందలించిండు. 'ఊర్లె డాక్టర్ పని చెయ్యిరా అంటే అదీ చాతగాదు. మందులు అమ్మురా అంటే ఇదీ చాతకాదు. బతుకాలంటే ఈతలు నేర్వాలెరా..ఎదురీతగాదు. వాలుగా ఈదాలె" అని నచ్చజెప్పిండు. తిరుపతిని బతిమిలాడి

ఒప్పందం చేసిండు.

ఆ సంగతి యాదికచ్చింది సత్యంకు. ఎందుకో గాని పెయ్యంతా జిలజిల పుట్టింది. నీరసంగా కుర్చీలో కూసున్నడు. అప్పుడే తిరుపతి సైకిలిమీద వచ్చిండు.

"ఏంరా ... బామ్మర్ది... కొంపలంటుక పోయినట్టు రందికొద్ది కూసున్నవు. ఏమైందిరా.." తిరుపతి లోపలికి వచ్చి నవ్విండు.

సత్యం అతనివైపు నీరసంగా చూసి "నువ్వు ఓ పక్క కొంపలకు కొర్రాయి పెట్టుకనే రావడితివి. అంటుకోక ఏం జేత్తయి" అన్నడు.

తిరుపతి నవ్వుతూ "అరేయ్.. పొద్దుగల్ల పొద్దుగల్లనే బాలబోయికి యాబై అయితదని చెప్పినవట. అంత ఎక్కువ చెప్పుతావురా...అయిన దాంట్ల సగం కలిపి చెప్పుమని ఎన్నడో చెప్పితి. వాడు నిన్ను అవ్వనక్కని తిట్టవట్టె " అన్నడు.

సత్యం మాట్లాడలేదు. తిరుపతివైపు బాధగా చూసిండు.

తిరుపతి మాత్రం నవ్వుకుంటనే రాక్‌లోంచి ఒక గ్లూకోజ్ బాటిల్, రెండు ఇంజిక్షన్ బుడ్లు ఒక డిస్పోజబుల్ సిరంజి బ్యాగులో వేసుకొని ముప్పయి రుపాయలు చేతుల పెట్టిండు.

రోజుకు ఒకటి రెండయినా డ్రిప్స్ తీసుకపోతడు తిరుపతి. కాళ్ల గుంజినా కడుపునొచ్చినా, రోగం ఏదైనా సరే. గ్లూకోజు ఎక్కియ్యాలంటడు. తనే ఎక్కించి వంద వసూలు జేత్తడు.

"ఇయ్యల్ల ఎవని కొంప మునుగుతుందో..." పైసల్ని డ్రాలో ఏసుకుంటూ అన్నడు సత్యం.

"నీదేం నొత్తంది. ఫ్యాను కింద కూసుంటవు. నేను కాలుకు బట్ట గట్టకుంట సైకిల్‌మీద ఊరంత తిరుగాలె" అన్నడు. తిరుపతి కోపంగా

అప్పుడే ఇద్దరు ముగ్గురు పేషెంట్లచ్చింద్రు. చిట్టీలు చూస్తూ మందులిత్తండు సత్యం. తిరుపతి పక్కనే స్టూలుమీద కూసున్నడు.

అప్పుడే విజయ్ వచ్చిండు. సత్యం మొఖమైనా చూడకుంట తిరుపతి వైపు చూసి నవ్విండు. బొటనవేలు ఎత్తి చూపి " అది...ఆ షాపుల" అంటూ వెళ్లిపోయిండు.

సత్యం అది చూసిండు. ఏమీ తెలువనట్టే మందులు ఇస్తూనే "ఏంటిదట...ఏమో సైర జేత్తండు..." అని తిరుపతిని అడిగిండు.

"వాడు రెయిన్‌బాక్స్ ఎజెన్సీల పనిజేత్తుండె. అది నంబర్‌వన్ కంపినిగదా! మంచి సర్కిల్ పెరిగింది. దాంట్ల పర్సంటేజి తక్కువ ఉంటది. ఆ సర్కిల్ మొత్తంను ఇప్పుడు జెనరిక్ మెడిసన్‌కు డైవర్ట్ చేత్తండు. నువ్వు గూడ పెట్టుకో. మంచి బెన్‌ఫిట్" అంటూ లేచిండు తిరుపతి.

ఏదో అందామనుకున్న సత్యం పెద్దబాలయ్య రావడంతో ఆగిపోయిండు. పెద్దబాలయ్య

ఆగమాగాన వచ్చిండు. వత్తవత్తనే " తిరుపతీ! నువ్వు ఇక్కడున్నావురా... నేను ఊరంత తిరిగిన. మా బిడ్డకు కడుపు నొత్తందంట. ఇంటిదాక రాకపోతివి " అన్నడు

తిరుపతి రెండడుగులు ముందుకేసి " అట్లనా ...ఇగో వత్తిపా... సైకిల్ మీద వత్త నడువు " అన్నడు.

అతని గొంతులో వెక్కిరింత ఉంది. అది సత్యం గుర్తువట్టిండు. పెద్దబాలయ్య గుర్తువట్టలేదు. నిజమే అనుకుని వెళ్లిపోయిండు.

బాలయ్య అటు నాలుగు అడుగులు వెయ్యంగనే తిరుపతి ఇటు ఎనుకకు అడుగేసిండు. "ఆ.. గోశిగాడు ...రారా అనంగనే ఉరుకుతరు. నన్ను ఇంటిమూదుసుట్లు తింపుకున్నరు. ఆపిరీషన్ చేసినప్పుడు మాత్రం ఆ గోపాల్‌గాన్ని తోలుకపోయిండ్రు. కేసు నేనే తెచ్చిన్నని వాడు ఐదువందలు అడుక్కచ్చుకున్నడు " అన్నడు కోపంగా తిరుపతి.

సత్యంకు పెయ్యి జిల జిలమంది. 'థూ మీరు మనుసులు గాదు. పీక్కతినే దయ్యాలు' అన్నడు.

తిరుపతి నవ్వుతూ సైకిలెక్కి "అందుకేరా బామ్మర్దీ... ఏంత తెలువకపోయినా మేము డాక్టర్లమైనం. అన్ని తెలిసి నువ్వు పిచ్చోనివైనవు. మేము క్లీనిక్‌లు తెరిస్తే నువ్వు ఉన్నది మూసుకున్నవు" అన్నడు.

సత్యంకు మండుకచ్చింది. తుపుక్కున ఊంచి తిడుదామనుకున్నడు. ఒక పేషెంట్ చిట్టితో రావడంతో నోట్లెమాటలు నోట్లెనే ఆగిపోయినయి.

అది గోపాల్ డాక్టర్ రాసిన చిట్టి. మందుల కాంబినేషన్ చూస్తెనే భయమయింది. ఒకదానికొకటి పొంతనలేదు. మామూలుగా అడిగినట్టు ఏమైందని అడిగిండు సత్యం. కడుపులో వికారమని చెప్పిండు. పేషెంటు. ఒక్క జినటాక్ గోళీతో సదురుకునేది ఆరు రకాల గోళీలు నాలుగున్నయి.

గోపాల్ యాడాది కిందనే సత్యంతో ఒక విషయం చెప్పిండు. ఎక్కువ మందులు రాస్త. పర్సెంటేజి ఇయ్యిమని అడిగిండు. సత్యం కుదరదన్నడు. ఊర్లో ఉన్న ఇంకో షాపుతో ఒప్పందం చేసుకున్నడు గోపాల్. ఇది ఆ షాపుకు పోయే చిట్టి. తనవద్దకు ఎందుకు వచ్చిందో సత్యంకు అర్థం గాలేదు.

వాపసు పంపిద్దామా అని ఆలోచించిండు సత్యం. ఇంతకుముందు రెండు మూడు చిట్టీలు అట్లనే పంపిస్తే సత్యం షాపులో మందులు దొరకవన్న పుకారు పుట్టింది. అందుకని రాసిన మందులు ఇచ్చి బిల్లు తీసుకున్నడు. ఏదో తప్పుచేసినట్టు గుండె బరువెక్కింది.

"ఇప్పుడన్నా తక్కువైతదో లేదో... రెండు రోజులాయె మందులు తినవట్టి. ఆ షాపుల మందులు పారుతలెవ్వని నీ దగ్గరికచ్చిన" మందులు తీసుకుంటూ అన్నడు పేషెంటు. అతని గొంతులో బాధ ఉంది. అంతకుమించి నిస్సహాయత ఉంది.

...

'ఈ మందులు వాడితే ఇంక యాడాదికైనా తగ్గది' అనుకున్నడు సత్యం. అప్పటికప్పుడు ఆ మందులు కాదని రెండే రెండు పనిచేసే గోళీలు ఇయ్యాలనిపించింది. అట్ల ఇస్తే ఈ పేషెంట్లు నమ్మరు. డాక్టరుకు చూపిస్తరు. వాళ్లు తమ ఉనికికే ముప్పు వత్తుందని ఒకటికి రెండు చెప్పి పేషెంట్లను ఉసిగొల్పుతరు. వాళ్లు నిజమని నమ్మి షాపు ముందుకచ్చి లొల్లి పెడుతరు.

"ఏవడేమన్నగానీ... చెప్పితే ఇనరు. నన్నే దొంగంటరు." అనుకున్నడు సత్యం.

పేషెంటు వెళ్లిపోయిండు. ఎంతగా సర్దిచెప్పుకున్నా సత్యంకు బాధగానే ఉంది. తిరుపతికి కొంతగాకున్నా కొంతయినా మందులు రాసే నేర్పు ఉంది. గోపాల్‌కు ఆ మాత్రం కూడాలేదు. సెవంత్ ఫేల్. మందులు రాస్తె పుట్టెడు తప్పులు. మాటల్లో మాత్రం నరుకుడు పోశెట్టి. ఐదు నిముషాల్లో పందిని నందిని చేస్తడు. ఇంకొ ఇద్దరైతే ఇంకా ఆగం. ఏం మందులు రాస్తుండ్రో వాళ్లకే తెలువది.

ఎక్కడినుంచి చూసిండోగనీ పేషెంటు అటు వెళ్లిండో లేదో షాపు ముందు దిగిండు గోపాల్. దిగుత దిగుతనే 'ఏంరా బామ్మర్దీ... పొద్దున పొద్దున మంచి గిరాకి పంపిన. చాయన్నా తాగిత్తవాలేదా...? అన్నడు.

సత్యంకు మండుకచ్చింది. "చాయగాదు...ఇంత రక్తం దాగిత్త. వానికి వచ్చిన రోగమేందీ... నువ్వు రాసిన మందులేందీ...? ఏం బాధ అనిపియ్యదా మీకు..." అన్నడు సత్యం

గోపాల్ సత్యంను పిచ్చోన్ని చూసినట్టు చూసి నవ్విండు "ఓరి పిచ్చోడా!... ఇదే ఊర్లె రెండేండ్లు డాక్టర్ పనిజేసినవు. ఏమయింది? నీకు మందులే రాయరాదన్నరు. రేండేండ్ల నుంచి షాపు నడుపుతున్నవు. ఏమైంది...? నీ దుకాండ్ల మందులే లేవంటున్నరు. నన్ను సూడు. రెండేండ్లల్ల స్కూటర్ కొన్న. యాడాది కిందనే మందుల దుకాణం పెట్టినోడు సూడు ఇల్లు కొన్నడు..." ఎక్కిరించి వెళ్లిపోయిండు గోపాల్

నీరసంగా కుర్చీలో కూసున్నడు సత్యం. అతనికి డాక్టర్ పని చేసిన రోజులు గుర్తుకచ్చినయి. వర్షాకాలం కలరా, డయేరియా, మోషన్స్ మామూలే గదా! నీళ్లను మరుగబెట్టుకుని తాగుమనేవాడు సత్యం. ఒకటి రెండు గోళీలు ఇచ్చేవాడు. ఒకటి రెండు రోజులకు తగ్గేది.

అప్పుడే గోపాల్ దవాఖాన తెరిచిండు.

గోపాల్ వచ్చినంక మెట్రోజిల్, గ్లూకోజ్, డి.ఎన్.ఎస్., ఆర్.ఎల్. మందులు రాయడం మొదలు పెట్టిండు. అవి హైడోస్ మందులు. గంట రెండు గంటల్లోనే రిలీఫ్ అయ్యేది. బిల్లుమాత్రం వంద దాటేది. ఊరి గిరాకి గోపాల్‌కు మర్రింది. అదిచూసి తిరుపతి దవాఖాన పెట్టిండు.

తిరుపతి వచ్చినంక గ్లూకోజ్‌లు మొదలైనవి. ఏ చిన్న రోగం వచ్చినా భయపెట్టేవాడు. పెద్ద హాస్పిటల్లకు పంపి కమీషన్ తీసుకునేవాడు.

గర్భవతులైతే మందులే రాసేవాడు కాదు సత్యం. గైనకాలజిస్టును కలువమనేవాడు. వాళ్లమాత్రం మందులు రాసేవాళ్లు. పురుళ్లు పోసేవాళ్లు. చివరిక్షణంలో పిండం ఎదురు తిరిగితే మాత్రం ఎవరిమీదనో తప్పును తోసేవాళ్లు.

అట్లా జనానికి సత్యం మీదకంటే వాళ్లమీదనే ఎక్కువ నమ్మకం కుదిరింది. సత్యం చెప్పే ఆరోగ్యసూత్రాలు విని నవ్వుకునేవాళ్లు. అయినా పద్దతి మార్చుకోలేదు సత్యం. వాళ్ల పద్ధతిని కూడా మార్చుకొమ్మనలేదు.

కానీ పక్కీరు మైబెల్లికి రాళ్లు లేకున్నా ఉన్నాయని తిరుపతి, కుమ్మరి మల్లమ్మకు గర్భసంచికి పుండు లేకున్నా ఉన్నదని గోపాల్ ఆపిరీషన్లు చేయించినప్పుడు మాత్రం "ఓరేయ్... రొట్టెను కుదుక్క తాగుండ్రి. నమిలి మింగకుండ్రి. జనాలు మిమ్మల్ని నమ్ముతుండ్రు. ఆ నమ్మకాని అమ్ముకోకుండ్రి" అన్నడు.

తర్వాత పేషెంట్లు లేక వైద్యం మాని షాప్ తెరిచిండు సత్యం.

పొద్దు నెత్తిమీదికచ్చింది. అన్నం తినేయాళ్ల. షట్టర్ దించిండు సత్యం. ఇంటికి పోతుంటే క్లినిక్‌లోంచి కేకవేసి పిలిచిండు తిరుపతి. గులుక్కుంటనే తిరుపతి దగ్గరి పోయిండు సత్యం

క్లినిక్‌లో ఎవలు లేరు. తిరుపతి ఒక్కడే కూసున్నడు. సత్యంను కూసొమ్మని చెప్పి "బామ్మర్దీ ...నువ్వు బతుకు. నన్ను బతుకనియ్యి. విజయ్‌సారు మంచోడు. ఎంత అంటే అంత కమీషనిత్తడు. ఆ మందులు పెట్టుకో...నేను అవేరాత్త. గోపాల్ వేరే మందుల దుకాణంలో కమిటయిండు. మనమిద్దరం కలుపుకుందాం..." అన్నడు.

సత్యంకు చిర్రెత్తుకచ్చింది. విజయ్ షాపులతో కాక డాక్టర్లతో కూడా చెయ్యి కలిపిండని తెలిసినంక పాణం జల్లుమంది. ఇంకేమన్నా ఉందా...? వీళ్లు వందలకు వందలు నకిలీ మందులు రాత్తరు. అవి తిని జనాలు సస్తరు. వాళ్లను దేవుడే కాపాడాలె అనుకున్నడు.

"ఏమాయె ... సప్పుడు జెయ్యవు" అన్నడు మళ్లీ తిరుపతి.

"ఈ గవర్నమెంటుకు దిమాక్ లేదురా" లేస్తూ అన్నడు సత్యం.

అతడు లేస్తుంటే ఒప్పుకోలేదని అర్థం చేసుకున్నడు తిరుపతి. తనూ లేస్తూ 'ఎందుకో' అన్నడు ఎక్కసంగా

"ఒక బడి పెట్టాలంటే పర్మీషన్ గావాలె. ఒక మందుల షాపు పెట్టాలంటే లైసెన్సు గావాలె. పదిమందికి పనిచూపే కంపిని పెట్టాలన్న సవాలక్ష కండీషన్లు...అదే ఒక దవాఖాన పెట్టాలంటే ఒక కుర్చీ ఒక టేబులుంటే సాలు..." అంటూ బయటపడ్డడు సత్యం.

"అయ్యవోతే అమాస ఆగది. నీ సంగతి సూత్తపో బిడ్డా" వెనుకనుంచి తిరుపతి అన్నడు. వినికూడా విననట్టె వెళ్లిపోయిండు సత్యం.

ఇంటికి వెళ్లినా ఇదే ఆలోచన వెంటాడుతుంది సత్యంకు. ఊరు ఊరంతా గత్తర్లో గావరైనట్టు...గేరచ్చి తిరుగుతున్నట్టు అనిపించింది. జనాలకు ఈ మోసాన్ని విప్పి చెప్పాలనుకున్నడు. ఈ ఆలోచన వచ్చినంక తిండి నోట్లెకు పోలేదు. రెండు బుక్కలు తిని మంచంల ఒరిగిండో లేదో పెద్దబాలయ్య ఎగపోసుకుంట "మందులిత్తువురారా..." అని ఇంటికి వచ్చిండు.

చిట్టిజూత్తే సగం జెనరిక్ మెడిసనే ఉంది. వాడు పొద్దున వచ్చిండో లేదో... వీళ్లు పగటియాళ్ల వరకు రాయనే వట్టిరి అనుకున్నడు సత్యం. పెద్దబాలయ్య తల తిక్కమనిషి ఈ సంగతి ఏదీ చెప్పకుండా సగం దొరుకుతయి. సగం దొరకయి. అన్నడు.

"సగం ఒక జాగల... ఇంకో సగం ఇంకో జాగల కొనన్నా.. నీదో నల్లమొఖం దుకాణం. ఎవ్వి సక్కగుండయి" తిట్టుకుంటపోయిండు బాలయ్య.

సత్యంకు కోపానికి బదులు జాలి కలిగింది. తండ్రి ఏదో అడుగుతున్నా వినకుండా వచ్చి షాపులో కూసున్నడు. ఊరిచుట్టూ... ఊర్లె ఉండే జనాల చుట్టూ ఎవరో ఉరి బిగిస్తున్నట్టుగా...ఎవరో విషాన్ని ఎక్కిస్తున్నట్టుగా అనిపిస్తుంది.

గంటలోపలనే రెండు చిట్టీలచ్చినయి. సగానికి పైగా జెనరిక్. అందులో ఒకటి తిరుపతి పర్సనల్. లేవని తిప్పి పంపిండు సత్యం. తన మందులు అమ్మకం కానందుకు కాదు. ఏమీ తెలువని జనాలతో నకిలీమందులు తినిపిస్తున్నందుకు బాధగా ఉంది.

పది నిమిషాల్లోనే మరో చిట్టి. ఇది సాకలి ఎల్లవ్వది. తన దగ్గర మందులు దొరుకయని ఊరంతా తెలువాలని కావాలనే తోలిస్తున్నరా అనిపించింది సత్యంకు.

'వచ్చినోళ్లను వచ్చినట్టు ఇట్ల మర్రగొడితే ఏం లాభం' అనుకున్నడు. ఈ చిట్టీని పట్టుకున్నడు. ఇవిలెవ్వగని ఇదే ఫార్ములాతో ఉన్న కంపెనీ మందులు ఇత్తనన్నడు. ఎల్లవ్వ వద్దని పోయింది.

అప్పుడే లచ్చుమ్మ వచ్చింది. ఈ సారి లచ్చుమ్మకు చెప్పకనే అదే ఫార్ములా ఉన్న కంపెని మందులు ఇచ్చిండు. అరువై రూపాయల బిల్లు అయితే ఐదు తక్కువ చేసి యాభైఐదే తీసుకున్నడు.

ఎట్ల పోయిందో అట్లే తిరిగచ్చింది లచ్చమ్మ. ' వాడేం రాసిండు... నువ్వేం ఇచ్చినవు. దొంగమందులు అమ్ముడుకు నేనే దొరికినానురా ' అని గాయికెత్తుకుంది.

సత్యంకు నోట మాటరాలేదు. ఏం చెప్పాల్నో అర్థం కాలేదు. చెప్పినా లచ్చవ్వ అర్థం చేసుకోదు. మందులు తీసుకొని పైసలిచ్చిండు. పైసలు పట్టుకొని పోయిన లచ్చవ్వ పావుగంటకే మందులతో మళ్లా వచ్చింది.

'సత్తిగా... నీ తలపండువలుగ. మందిది మాడంటవు. నీదిగోకంటవు ఈ మందులన్నీ వాడు నలుపై రూపాయలకే ఇచ్చిండు. నువ్వు ఏదో ఇత్తివి. యాభై ఐదంటివి. ఇంత మోసముంటాదిరా..." అని గాయికెత్తుకుంది.

అవన్నీ నకిలీమందులని సర్ది చెప్పిండు సత్యం. లచ్చవ్వ వినలేదు. ‘ నీ మందులే దొంగమందులు. డాక్టరు రాసినయి ఒక్కటి లేవ్వు ’ అన్నది. పంచాది ముదిరింది. అద్దగంటకు తెగింది. ఇంకో చిట్టీ ఇట్లనే అయింది. పొద్దు గూకేవరకు నాలుగు కేసులైనయి. అందరు తిట్టిపోసుడే!

రాసింది ఉంటెనే ఇత్త. లేకుంటే లేదనుకున్నడు సత్యం.

వారంలో గిరాకీ పూర్తిగా పడిపోయింది. సత్యం షాపులో మందులే దొరకవని మరోసారి ఊరంతా ఎలిసిపారింది.

మంచి వైద్యం ఇయ్యాలనుకున్నడు సత్యం. జనం నమ్మలేదు. మంచి మందులైనా అమ్మాలనుకున్నడు. జనం నమ్ముతలేరు. సత్యం తండ్రికి మరోసారి పనిపడింది. అందరినీ కూర్చోబెట్టి ఒప్పందం చేయాలనుకున్నడు. సత్యం వినలేదు.

“ అయితే షాపు మూసుకుని గాడుదుల గాయి.” తండ్రి కోపంగా అన్నడు.

సత్యం షాపు మూసెయ్యలేదు. ప్రతి మనిషికీ ఒకేమాట చెబుతుండు. “నా షాపులో కల్తీ మందులుదొరుకయి” అని.

(పులికంటి సాహితీ సత్కృతి 2005 కథల పోటీలో ప్రత్యేకబహుమతి పొందిన కథ)

(మూసీ నవంబర్-2005)